క్లుప్తంగా

శభాష్ పోలీస్

గుంతలు పూడ్చిన మల్కాపురం ట్రాఫిక్ సిబ్బంది



సింధియా ప్రధాన కూడలి వద్ద గుంతలను పూడుస్తున్న మల్కాపురం ట్రాఫిక్ సిబ్బంది

సింధియా: రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న నివారణ చర్యలపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు బుధవారం రోడ్డు ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా ఎస్‌ఐ సుదర్శనరావు ఆదేశాల మేరకు సింధియా ప్రధాన కూడలి వద్ద ఏర్పడిన గుంతలను కాంక్రీట్‌తో పూడ్చారు. అనంతరం అక్కడున్న ఆటో సిబ్బందికి, వాహన చోదకులకు రోడ్డు భద్రతా నియమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ



బోల్తా పడిన కారు

బీచ్‌రోడ్డు: అతి వేగంగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. మంగళవారం అర్ధరాత్రి మద్దిలపాలెం నుంచి ఎన్‌ఏడీ వెళ్తున్న కారు.. సీతమ్మధార నుంచి రామాటాకీస్ వైపు వెళ్తున్న మరో కారు సత్యం జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. కార్లు రెండు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అల్లిపురంలో నివసిస్తున్న పులి వెంకటరెడ్డి అనే వ్యక్తి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అల్లిపురంలోని తన ఇంటి నుంచి బైక్ మీద మురళీనగర్‌కు ఓ పని నిమిత్తం బయలుదేరి వెళ్లాడు. తాటిచెట్లపాలెం హైవే దరి ధర్మానగర్ దగ్గరకు వచ్చేసరికి అదే దారిలో సర్వీస్ రోడ్డు నుంచి ఓ కారు హైవే వైపు వెళ్తూ ఇతడిని ఢీకొంది. దీంతో సదరు వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తలకు ఎడమవైపు గాయాలయ్యాయని వెంకటరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకుడు పెద్దరాజు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బృందావన మాలి..



ఎన్‌ఏడీ పాఠశాలలో చిన్నికృష్ణులు, గోపికలతో స్కూల్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి



వేణుగోపాల స్వామిని దర్శించుకుంటున్న బెహరా భాస్కరరావు, భక్తులు

గోపాలపట్నం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మందిరాల్లో భక్తులు విశేష పూజలు చేశారు. వీధుల్లో పందిళ్లు వేసి కృష్ణయ్యను ప్రతిష్ఠించి పండగ జరిపారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణల్లో ఆడిపాడి సందడి చేశారు. స్థానిక ఎన్‌ఏడీ రామకృష్ణ పాఠశాలలో విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. చిన్నికృష్ణులు, గోపికల వేషధారణల్లో ముచ్చట గొలిపారు. పాఠశాల డైరెక్టర్ రామకృష్ణారెడ్డి చిన్నికృష్ణుడి విగ్రహాన్ని ఊయలలో వేసి కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణుడి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పిల్లలు ఉట్టి కొట్టి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణ మందిరాల్లో పూజలు

జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు కృష్ణుడి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.



గవర రామాలయం వద్ద చిన్నికృష్ణుడు

- బుచ్చిరాజుపాలెం, వెంకటాపురం వేణుగోపాల స్వామి మందిరాల్లో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన చిన్నికృష్ణులు

విశాఖ విద్య: జీవీఎంసీ 50, 90 వార్డుల పరిధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీల్లో పలువురు వేడుకలను కోలాహలంగా జరిపారు. 90 వార్డు గవర రామాలయం వద్ద చిన్నారులకు శ్రీకృష్ణుని వేషధారణ చేసి వీధుల్లో తిప్పారు. చిన్నికృష్ణయ్యలు చేసే అల్లరితో కాలనీ వాసులు ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు.

జోరు వాన



ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ కింద వేచి ఉన్న వాహన చోదకులు



ఎన్‌ఏడీ జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

గోపాలపట్నం: అల్పపీడన ద్రోణి కారణంగా గోపాలపట్నం, ఎన్‌ఏడీ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం జోరు వాన కురిసింది. వర్షంలో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి ఎన్‌ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ కింద వాహనాలతో వేచి ఉన్నారు. కొంత మేర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక్కడి నాలుగు రోడ్లలో బ్రిడ్జి దిగువున వాహనాలు నిలిచిపోయాయి. వర్షం కాస్తా తెరిపిచ్చిన తరువాత వాహనాలతో రహదారులు రద్దీగా మారాయి.

ఫణీంద్రను తల్లికి అప్పగించిన రెడ్‌క్రాస్ సొసైటీ



ఫణీంద్రను తల్లి మల్లేశ్వరికి అప్పగిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ : పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన ఫణీంద్ర (22) అనే యువకుడిని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు త్రీటౌన్ పోలీసుల సమక్షంలో అతని తల్లి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. బీటెక్ చదువుతున్న ఫణీంద్రను తల్లి కళాశాలకు సరిగ్గా వెళ్లడం లేదని మందలించింది. దీంతో కోపానికి గురైన అతను ఇంట్లో నుంచి పారిపోయి వచ్చి విశాఖ చేరుకున్నాడు. ఈ నెల 2వ తేదీ రాత్రి నైట్ పెట్రోలింగ్ చేస్తున్న త్రీటౌన్ ఎస్‌ఐ రాముతో పాటు సిబ్బందికి బీచ్‌రోడ్డులో కనిపించాడు. వివరాలు అడగ్గా సరైన సమాధానం ఇవ్వలేదు. ఎద్దైనా అఘాయిత్యం చేసుకుంటాడనే అనుమానంతో పోలీసులు ఫణీంద్రను త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించి అనంతరం పెదవాల్తేర్‌లోని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులకు అప్పగించారు. అతన్నుంచి వివరాలు సేకరించిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు అతని తల్లి మల్లేశ్వరితో పాటు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసుల సమక్షంలో బుధవారం అతన్ని తల్లి మల్లేశ్వరికి అప్పగించారు.

రేపు ఉచిత సామూహిక శ్రావణలక్ష్మీ పూజలు



సిరులతల్లికి అభిషేకం చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 8న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు అమ్మవారి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు పూరించి గురువారంలోగా అందజేయాలి.

నేడు సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీ దళార్చన నిర్వహించనున్నారు. రూ.1,500 పూజా రుసుం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

21వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు..

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు బుధవారం నాటికి 21వ రోజుకు చేరాయి. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సిరులతల్లికి భక్తులు విశేష అభిషేకాలు చేశారు. ఈ పూజల్లో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ



937వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే కార్మికులు తీవ్రస్థాయిలో నష్టపోతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవాలని, ప్రజా భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 937వ రోజు బుధవారం సంస్థలోని ట్రాఫిక్ విభాగ కార్మికులు పాల్గొని, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని, ప్లాంట్‌కు భూములు ఇచ్చిన నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దేశ ప్రజలందరూ ఐక్యంగా అడ్డుకోవాలని కోరారు. కార్మికుల హక్కులు కాపాడాలన్నా, భూ నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగంలోనే కొనసాగే విధంగా ప్రజలతో కలిసి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

బ్లాస్ట్ ఫర్నేస్-3లో ఉత్పత్తి ప్రారంభించాలి



స్టీల్‌ప్లాంట్ నూతన సీజీఎం స్వామిని సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: బ్లాస్ట్‌ఫర్నేస్-3లో ఉత్పత్తి సత్వరం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ వర్క్స్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఎస్.వి. స్వామిని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. సీజీఎంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు ఆయన్ను బుధవారం కలిసి, అభినందించారు. వారు మాట్లాడుతూ నూతన సీజీఎం నేతృత్వంలో ప్లాంట్ పూర్తి స్థాయిలో నడిచేలా సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. సీజీఎం స్వామి మాట్లాడుతూ ఈ ఏడాది కచ్చితంగా నెట్ ప్రాఫిట్ వస్తుందన్నారు. ప్లాంట్‌లో చిన్న చిన్న సమస్యలు ఉన్నా ప్లాంట్‌ను ముందుకు తీసుకు వెళ్లడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, బీఎంకె నాయక్, రమణమూర్తి, ఎస్.ఎ. నాయుడు, నారాయణరావు, మింది దేముడు తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటాలు, ఆభరణాల బహూకరణ



అర్చకుడికివెండి కిరీటాలు, ఆభరణాలు అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పాపయ్యరాజుపాలెం ఆర్టీసీ లేఅవుట్‌లోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి దాతలు సమకూర్చిన వెండి కిరీటాలు, ఆభరణాలను బుధవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతులమీదుగా అందజేశారు. పాపయ్యరాజు పాలేనికి చెందిన దాతలు జి.సంగమేశ్వరరావు, రామారావు, దూర్వాసులు, రవి ప్రసాద్, కృష్ణారావు, శేఖర్, నాగమణి, మోహనరావు, రామప్రసాద్ రూ.లక్షతో స్వామికి వెండి కిరీటాలు, ఆభరణాలు చేయించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు వాటిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు, కె.సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు కేవీఆర్.లక్ష్మి, భీమారావు, రామసూరి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎప్పుడూ చేరువలో ఉంటా..

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 59వ వార్డులో పార్టీ కార్యాలయం ప్రారంభం



నక్కవానిపాలెంలో కార్యాలయాన్ని ప్రారంభించి పూజలు చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: తనను నమ్ముకున్న ప్రజలకు మరింత చేరువలో ఉండేందుకు సొంత నిధులతో కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. 59వ వార్డు నక్కవానిపాలెంలో నిర్మించిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలకు తాను వెళ్లినప్పుడు స్థానిక ప్రజలు వారి సమస్యలను తనకు విన్నవించుకునే వారన్నారు. వాటిని తాను పరిష్కరించడంతో తమకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తమ బాగోగులు చూసుకోవాలని ఆయా ప్రాంతాలవాసుల చేసిన విజ్ఞప్తి మేరకు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఇకపై నక్కవానిపాలెం కార్యాలయంలో ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని అక్కడే పరిష్కరించే దిశగా అడుగులు వేస్తానని ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ మాట్లాడుతూ నాయకుడంటే ఆడారి ఆనంద్‌కుమార్‌లా ఉండాలని, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన గణబాబు ఏనాడైనా ప్రజల కోసం ఆలోచించి ఒక్క కార్యాలయాన్నయినా ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు, కొణతాల సుధ, గులిగిందల లావణ్య, పుర్రె పూర్ణశ్రీ యాదవ్, మాజీ కార్పొరేటర్లు గల్లా శ్రీను, పిల్లా కన్నబాబు, నాయకులు జి.వి.ఎల్.నరేష్, మళ్ల ధనలత, ఆడారి హరీష్, అంగ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ సెంటర్ ప్రారంభం



బెహరా ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ స్వర్ణలత శివదేవి

గోపాలపట్నం: గోపాలపట్నం బెహరా ఆస్పత్రిలో బుధవారం క్రిటికల్ కేర్ సెంటర్‌ను 92వ వార్డు కార్పొరేటర్, బెహరా గ్రూప్ సంస్థల చైర్‌పర్సన్ బెహరా స్వర్ణలత శివదేవి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి ఎండీ రవితేజ మాట్లాడుతూ రోగులకు 24 గంటలు అత్యవసర సేవలు, మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలతో క్రిటికల్ కేర్ సెంటర్ అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. నిరంతరం నిష్ణాతులైన వైద్యులు వారి సేవలు అందిస్తున్నారన్నారు. న్యూఢిల్లీ నుంచి సీనియర్ వైద్యుడు డాక్టర్ నవీన్‌చంద్ర రోగులకు సేవలందించేందుకు ఆస్పత్రికి వచ్చారన్నారు. కార్యక్రమంలో బెహరా గ్రూప్ సంస్థల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య, మహిళా వైద్య నిపుణురాలు బెహరా ప్రావీణ్య, వైద్యులు అనంత్‌కుమార్, వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యనారాయణ సేవలు ప్రశంసనీయం

- బదిలీపై వెళ్తున్న ఐలా కమిషనర్‌కు వీడ్కోలు
- కొత్త కమిషనర్ జయచంద్రకు సాదర స్వాగతం



ఐలా పూర్వ, నూతన కమిషనర్లను సన్మానిస్తున్న ఆటోనగర్ ఐలా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఐలా కమిషనర్‌గా కె.సూర్యనారాయణ అందించిన సేవలు ఎనలేనివని ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు) కొనియాడారు. బదిలీపై అమరావతి వెళ్తున్న ఆయన్ను ఆటోనగర్ ఐలా భవనంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఐలా ప్రతినిధులు మాట్లాడుతూ సూర్యనారాయణ పారిశ్రామిక వేత్తలకు స్నేహపూర్వక వాతావరణంలో సహకారం అందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఐలా వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కమిషనర్‌కు ఆహ్వానం

ఐలా నూతన కమిషనర్‌గా నియమితులైన జయచంద్రకు ఐలా ప్రతినిధులు సాదరంగా స్వాగతం పలికారు. ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కొంతకాలం ఆటోనగర్ ఐలా కమిషనర్‌గా సేవలందించిన జయచంద్ర మళ్లీ నియమితులు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసివా) అధ్యక్షుడు ఎస్.పాండురంగ ప్రసాద్, లఘు ఉద్యోగ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, ఐలా సంయుక్త కార్యదర్శి రామకృష్ణంరాజు, పెద గంట్యాడ ఐలా అధ్యక్షుడు సత్యనారాయణ, ఐలా కోశాధికారి పద్మావతి పాల్గొన్నారు.

రైతుబజారుకు విశేష ఆదరణ

- మర్రిపాలెం రైతుబజార్‌కు రోజుకు 2 వేల మందికిపైగా వినియోగదారులు
- నిర్ణీత ధరలకే అన్ని రకాల సరకులు

- రైతు బజార్ నిర్వహణ: ప్రతీ రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
- ప్రతీ బుధవారం సెలవు
- గుర్తింపు పొందిన రైతులు: 94
- సమాచారం కోసం : కొమ్మనాపల్లి వరహాలు, ఎస్టేట్ ఆఫీసర్ సెల్: 9676816074



మర్రిపాలెం రైతుబజార్



తాజా కూరగాయలు విక్రయిస్తున్న మహిళా రైతులు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సమీపంలోని మర్రిపాలెం రైతు బజార్‌కు వినియోగదారుల తాకిడి పెరుగుతోంది. జీవీఎంసీ 52వ వార్డు పరిధిలో జాతీయ రహదారికి ఆనుకొని ఏర్పాటు చేసిన రైతుబజార్‌కు ఎన్‌ఏడీ, మురళీ నగర్, మాధవ దార, మర్రిపాలెం నుంచి వినియోగదారులు ప్రతీ రోజూ 2 వేలకు పైగానే వస్తుంటారు. ఇక్కడ తాజా కూరగాయలతో పాటు, ఇతర నిత్యావసర సరకులు సైతం లభిస్తున్నాయి. రైతులతో పాటు, డ్వాక్రా గ్రూప్ మహిళలు, డీసీఎంఎస్, విశాఖ డెయిరీ ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేసి బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే సరుకులు విక్రయిస్తున్నారు.

మేలు చేయాలనే సంకల్పంతో..

నగర వాసులకు చెంతనే కూరగాయలు, నిత్యావసర సరుకులు నిర్ణీత ధరలకు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. మర్రిపాలెం రైతు బజార్ నిర్వహణ ద్వారా రూ.1.20 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఎస్టేట్ అధికారి, అటెండర్, స్కావెంజర్ల వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు పోనూ ప్రభుత్వానికి పెద్దగా మిగిలేది ఏమీ లేదు. బయట మార్కెట్‌లో కృత్రిమ కొరత, ధరల దోపిడీ వంటి చర్యలతో ఆర్థిక భారం లేకుండా వినియోగదారులకు మేలు చేయాలనే సంకల్పంతోనే రైతు బజార్ నిర్వహిస్తున్నారు.

రైతులే వ్యాపారులు

మర్రిపాలెం రైతుబజార్‌లో 94 మంది రైతులు నమోదు చేసుకున్నారు. వీరిలో 60 మందికి పైగా రైతుబజార్‌కు కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. గుర్తింపు పొందిన రైతులు ఎటువంటి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదు. వారు పండించిన పంటను బజార్‌కు తీసుకొచ్చి నేరుగా వారే వినియోగదారులకు విక్రయించుకునేలా ఇక్కడ ఏర్పాట్లు చేశారు.

సౌకర్యాలు కల్పిస్తున్నాం



రైతుబజార్‌లో వినియోగదారుల అవసరాల మేరకు కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. నిర్ణయించిన రేటుకే కూరగాయలు విక్రయించేలా చూస్తున్నాం. దీని వల్ల అటు రైతులకు, ఇటు వినియోగదారులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది.

– కొమ్మనాపల్లి వరహాలు, ఎస్టేట్ ఆఫీసర్, మర్రిపాలెం రైతుబజార్

దళారుల బెడద తప్పింది



రైతు బజార్‌లో దుకాణం నిర్వహణకు గుర్తింపుకార్డు ఇస్తున్నారు. పొలంలో పండించిన పంట మేమే రైతు బజార్‌కు తీసుకొచ్చి అమ్ముకుంటున్నాం. అన్ని ఖర్చులు పోనూను రోజుకు రూ. 500 పైగానే మిగులుతుంది. గతంలో దళారులకు అమ్ముకోవాల్సి వచ్చేది. రైతు బజార్‌లో ఏర్పాట్లు కూడా బాగున్నాయి.

– ఒమ్మి సత్తిబాబు, రైతు

వీనులవిందుగా గాత్ర కచేరీ



కచేరీ నిర్వహిస్తున్న శారదా సుబ్రహ్మణ్యం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత నృత్య నాటకోత్సవాల 5వ రోజు శారదా సుబ్రహ్మణ్యం గాత్ర కచేరీ వీనులవిందుగా సాగింది. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, శారదా సుబ్రహ్మణ్యం గుమ్ములూరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేశారు. వయొలిన్‌పై మావుడూరి శర్మ, మృదంగంపై జయ భాస్కర్, ఘటంపై ఎం.సూర్యప్రసాద్ సహకారం అందించారు.